క్లుప్తంగా

పెద్దమ్మ తల్లికి బోనాలు



గీసుకొండ : మండలంలోని ధర్మారంలో పెద్దమ్మ తల్లికి ముదిరాజ్ కులస్తులు మంగళవారం ఘనంగా బోనాలు సమర్పించారు. గ్రామస్తులు బోనాలతో తరలివచ్చి ఊరచెరువు వద్ద ఉన్న ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. డీజే నడుమ ఆటపాటలతో సందడి చేశారు.

వేసవి సెలవుల్లో పిల్లలు జాగ్రత్త



చెన్నారావుపేట : పాఠశాలలకు వేసవి సెలవులు వచ్చిన నేపథ్యంలో పిల్లలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలకు ఒంటిపూట బడులు, సెలవులు వచ్చిన నేపథ్యంలో పిల్లలు సరదాగా చెరువులు, కుంటలు, బావుల వద్ద ఈతకు వెళ్లే అవకాశం ఉందన్నారు. ఈ క్రమంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలకు అవగాహన కల్పించడంతోపాటు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని తెలిపారు. పిల్లలు చెరువులు, కుంటలు, బావుల వద్దకు ఈతకు వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. మొరం గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని చెప్పారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పిల్లలు, వృద్ధులు ఎండలో తిరగొద్దన్నారు. వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని, చర్మవ్యాధులు సోకుతాయని తెలిపారు. ఏవైనా పనులుంటే ఎండ తీవ్ర రూపం దాల్చక ముందే పూర్తి చేసుకోవాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



రాయపర్తి : పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ తెలిపారు. మండలంలోని సూర్యతండాలో ఎండాకాలంలో బోరుబావిని తవ్వించి ఏర్పాటు చేసిన చేతిపంపును మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లో పప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని ఎమ్మెల్యే సహకారంతో పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామంలో భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు బన్నా నాయక్, రవినాయక్, శ్రీనునాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఐనవోలు: మండలంలోని వెంకటాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్టుకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇన్‌చార్జ్ ఏఈ శివకుమార్ మంగళవారం తెలిపారు. వెంకటాపూర్ విద్యుత్ వినియోగదారులతో పాటు వ్యవసాయ కనక్షన్లు కలిగిన వారికి నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. రైతులు, గ్రామస్తులు గమనించి సహకరించాలని కోరారు.

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక

ఖిలా వరంగల్: మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని వక్ఫ్‌బోర్డు జిల్లా ఇన్‌స్పెక్టర్ రియాజ్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కోరారు. వరంగల్ సబ్ డివిజన్ ఏసీపీ నందిరామ్‌నాయక్ ఆదేశాల మేరకు వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని ఖిలా వరంగల్ ఈద్గాలో జరగనున్న సామూహిక ప్రార్థనల ఏర్పాట్లను ముస్లింలతో కలిసి వారు మంగళవారం పరిశీలించారు. అనంతరం రియాజ్, మల్లయ్య మాట్లాడారు. ఖురాన్ ప్రకారం ముస్లిములు రంజాన్ పండుగ నాడు ఉదయం ఆధ్యాత్మిక చింతనతో నమాజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో షఫియొద్దీన్, నూరొద్దీన్, గౌస్, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

పైడిపల్లిలో సీఆర్‌పీఎఫ్ బలగాల కవాతు

వరంగల్: రానున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పైడిపల్లిలో సీఆపెఫ్ బలగాలు మంగళవారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పులి రమేష్ మాట్లాడారు. ఎన్నికల్లో అర్హులందరూ ఓటేయాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘించొద్దని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్సైలు రాజు, నర్సింహారావు పాల్గొన్నారు.



నర్సంపేట : శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న అర్చకులు



నర్సంపేట రూరల్ : లక్నెపల్లిలో పంచాగం పఠనం చేస్తున్న వేద పండితుడు



పర్వతగిరి : శివాలయంలో పూజ చేస్తున్న మాజీ మంత్రి దయాకర్‌రావు దంపతులు



సంగెం : కుంటపల్లిలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

ఘనంగా ఉగాది వేడుకలు

నర్సంపేట : పట్టణంలోని ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుంచే ఆలయాల్లో అర్చకులు అభిషేకాలు, సహస్ర నామార్చన ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. శివాంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు నల్ల మనోహర్ రెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో శ్రీక్రోధి నామ సంవత్సర పంచాంగ శ్రవణం నిర్వహించారు. అర్చకులు రాశి ఫలాలను వెల్లడించారు. శ్రీభూనీలా సమేత శ్రీవేంకటేశ్వరాలయంలో చైర్మన్ ఎర్ర జగన్ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు రామానుజాచార్యులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో ఆర్య వైశ్య సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు శింగిరికొండ మాధవ శంకర్ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. అర్చకుడు అయిన వోలు కృష్ణమూర్తి పంచాంగ శ్రవణం చేశారు.

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆలయాల్లో సందడి నెలకొంది. సాయంత్రం వేదపండితుల సమక్షంలో పంచాంగ శ్రవణం చేపట్టారు.

సంగెం : మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, ముఖ్య కూడళ్లలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. శ్రీక్రోధి నామ సంవత్సరంలో గ్రామాలకు శుభఅశుభ ఫలితాలు, వర్షం, పాడిపంటలు, తదితరాల గురించి పంచాంగ శ్రవణంలో ప్రజలు తెలుసుకున్నారు.

పర్వతగిరి : మండలవ్యాప్తంగా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. మండల కేంద్రంలోని పర్వతాల శివాలయంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణాన్ని తిలకించారు.

దుగ్గొండి : నాచినపల్లిలోని రామాలయంలో ఆర్చకుడు రమేశ్‌మూర్తి, తిమ్మంపేట లక్ష్మీనర్సింహాస్వామి ఆలయంలో ఆర్చకుడు రాంకీచార్యులు, కేశవాపురం వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్చకుడు సాగర్‌శర్మ పంచాంగ శ్రవణం చేశారు. ఆంజనేయ స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో భక్తులు నగర సంకీర్తన నిర్వహించారు. భజన చేస్తూ కోలాటాలతో శోభాయాత్ర చేపట్టారు. కంఠమహేశ్వరస్వామి ఆలయంలో గీత కార్మికులు కంఠమహేశ్వరునికి భక్షాలు, ఉగాది పచ్చడి నైవేద్యంగా పెట్టి పూజలు చేశారు. బాటసారులందరికి ఉగాది పచ్చడి అందించారు.

ఖానాపురం : మండలంలోని బుధరావుపేట, ఖానాపురం, ధర్మారావుపేట, అశోక్‌నగర్, తదితర గ్రామాల్లోని ఆలయాల్లో పంచాంగ శ్రవణం నిర్వహించారు. భక్తులు ఆలయాల్లో పూజలు చేశారు.

నల్లబెల్లి : మండలంలోని ముచ్చింపుల, రుద్రగూడెం, నల్లబెల్లి హనుమన్ ఆలయం, రాజరాజేశ్వరస్వామి, సీతారామాంజనేయస్వామి ఆలయాల్లో పంచంగ శ్రవణం చేశారు. అర్చకులు శ్రీనివాస శర్మ, పెండోట మురళీమోహనాచారి, కొండ కృష్ణస్వామి తదితరులు పంచాగాన్ని వివరించారు.

చెన్నారావుపేట : మండలంలోని సిద్దేశ్వరాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. కాలం పులి మీద వచ్చిందని అర్చకులు బీఎం.శాస్త్రీ, సాయి శాస్త్రీ, గణేశ్ శాస్త్రీ తెలిపారు. మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయంలో వరసిద్ధి గణపతుడిని అర్చకులు బీఎం.శాస్త్రి, సాయి శాస్త్రీ గరకతో ప్రత్యేకంగా అలంకరించి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. సిద్దేశ్వరుడికి శివకేశవుల అలంకరణలో పూజ చేశారు.

రాయపర్తి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలు నిర్వహించారు. అర్చకులు పంచాంగ శ్రవణం చేశారు. పల్లెల్లో సందడి నెలకొంది.

నెక్కొండ : స్థానిక ఆంజనేయ స్వామి, గుండ్రపల్లి రామాలయాల్లో పంచాంగ శ్రవణం చేశారు. ధర్మకర్తల కమిటీ చైర్మన్లు బెజ్జంకి వెంకటేశ్వర్లు, కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్లు, అర్చకులు గోపాలకృష్ణమూర్తి శాస్త్రీ, భవిశాస్త్రీ, రజనీశాస్త్రీ వ్యవసాయం, వాతావరణం, రాశిఫలాల జాతకాలను విన్నారు.



దుగ్గొండి : నాచినపల్లిలోని రామాలయంలో..



ఖానాపురం : బుధరావుపేటలో..



నల్లబెల్లి : పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు



చెన్నారావుపేట : సిద్ధేశ్వరాలయంలో..



రాయపర్తి : మొరిపిరాలలో..



నెక్కొండ : ఆంజనేయస్వామి ఆలయంలో..



దుగ్గొండి : నగర సంకీర్తన చేస్తున్న భక్తులు

‘శ్రీక్రోధి’ బీజేపీకి అనుకూలం

● జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

గీసుకొండ : జ్యోతిష్య పండితుల పంచాంగ శ్రవణం ప్రకారం శ్రీక్రోధి నామ సంవత్సరం బీజేపీకి అనుకూలమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ తెలిపారు. కార్యకర్తలు కష్టపడి పని చేస్తే వరంగల్ పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని ధర్మారంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో ఉగాది పండుగను పురస్కరించుకుని ప్రముఖ జ్యోతిష్య పండితులు డాక్టర్ కాశేశ్వరం సుమన్ శర్మ చేసిన పంచాంగ శ్రవణంలో రవికుమార్ పాల్గొని మాట్లాడారు. పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు అభ్యర్థించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, మార్తినేని ధర్మారావు, వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీశ్, డాక్టర్ కాళీప్రసాద్, ఎడ్ల అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పంచాంగ శ్రవణంలో రవికుమార్, నాయకులు

సన్మానం



నర్సంపేట : కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన తక్కళ్లపల్లి రవీందర్ రావును పట్టణంలోని 20వ వార్డు మిత్ర బృందం సభ్యులు మంగళవారం శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మిత్ర బృందం సభ్యులు సుదర్శన్‌రెడ్డి, మహేందర్, ఆనంద్, రాజు, గౌరారెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గుండ బ్రహ్మయ్య జాతర



ఉత్సవ మూర్తులను తీసుకొస్తున్న భక్తులు



ఆలయం ఎదుట మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

సంగెం : మండలంలోని గవిచర్లలో గుండ బ్రహ్మయ్య జాతర మంగళవారం వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ పూజారి పిల్లలమర్రి కార్తీక్ ఇంటి నుంచి విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు. రాత్రి పూట ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లు, కార్లు, ఆటోలు తదితర వాహనాలు గుడి చుట్టూ ప్రదక్షిణ చేసి గుండ బ్రహ్మయ్యను దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. జాతరకు గవిచర్లతోపాటుగా మండలంలోని తీగరాజుపల్లి, షాపూర్, లోహిత, రామచంద్రాపురం, ఆశాలపలి, కాట్రపల్లి తదితర గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పర్వతగిరి సీఐ శ్రీనివాస్, స్థానిక ఎస్సై ఎల్.నరేశ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉపాధినిస్తున్న ఎర్ర బంగారం



కల్లంలోని మిర్చిని పరిశీలిస్తున్న రైతులు



మిరపకాయల తొడిమెలు తీస్తున్న కూలీలు

దుగ్గొండి : ఎర్ర బంగారం పల్లె వాసులకు ఉపాధినిస్తోంది. వేసవి వచ్చిందంటే చాలు.. ఎండ వేడి తాళలేక చాలా మంది ఇంటి పట్టునే ఉండాల్సిన పరిస్థితి సహజం. రెండు నెలలపాటు పనులు చేయలేని దుస్థితిలో పేదల జీవనం కష్టమే. ఈ పరిస్థితిలో ఎర్రబంగారం పల్లె ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది. పనులు లేక వివిధ ప్రాంతాలకు వలస వెళ్లే పేదలు ఉపాధి పొందుతున్నారు. మండలంలో ఎర్ర బంగారం పంట విస్తృతంగా సాగు చేయడంతో కూలీలకు చేతినిండా పనులు దొరుకుతున్నాయి. మార్కెట్ యార్డుల నుంచి కొందరు స్థానికులు సొంత పూచీకత్తుపై మిర్చి బస్తాలను ట్రాలీల్లో తీసుకొచ్చి కూలీలతో గ్రేడింగ్ చేయిస్తున్నారు. గిర్నిబావి, నాచినపల్లి, పొనకల్, తొగర్రాయి, తదితర గ్రామాల్లో ఇంటింటికీ కి మిర్చి బస్తాలు అందజేసి తొడిమెలు తీసిన అనంతరం మళ్లీ తీసుకెళ్తున్నారు. తొడిమలు తీసినందుకు కిలోకు రూ.15–20 వరకు చెల్లిస్తున్నారు. దీంతో కూలీలు రోజుకు 10–20 కిలోల వరకు తొడిమలు తీస్తూ రూ.200–400 వరకు సంపాదిస్తున్నారు. నీడ పట్టునే ఉంటూ పని చేసే అవకాశం లభించడంతో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 300–400 మంది ఉపాధి పొందుతున్నారు. హమాలీలు, వాహనదారులకు సైతం ఉపాధి లభిస్తోంది.

డంపింగ్ యార్డు ఉన్నా ప్రయోజనం శూన్యం



పోలుకమ్మ చెరువు వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం



అధికారులు ఏర్పాటు చేసిన వదిలేసిన డంపింగ్ యార్డు

పర్వతగిరి : మండల కేంద్రంలో డంపింగ్ యార్డు ఉన్నా ప్రయోజనం సున్నా అంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో ఆరుబయటే చెత్తాచెదారం వేస్తున్న పరిస్థితి నెలకొంది. గ్రామ పంచాయతీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉపాధి హామీ పథకం కింద మండల కేంద్రంలోని పెద్ద చెరువు రిజర్వాయర్ సమీపంలో సుమారు రెండున్నరేళ్ల క్రితం ప్రభుత్వం డంపింగ్ యార్డు నిర్మింపజేసింది. అక్కడ కొద్ది రోజులు తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరణ చేపట్టారు. అదే క్రమంలో పెద్ద చెరువు రిజర్వాయర్ పక్కనే శివాలయాన్ని నిర్మించారు. శివాలయం పక్కనే డంపింగ్ యార్డు ఉండడంతో డంపింగ్ యార్డు ప్రాంతాన్ని శివాలయ పార్కింగ్ స్థలంగా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సేకరించిన చెత్తను గ్రామపంచాయతీ సిబ్బంది పోలుకమ్మ చెరువు ప్రాంతంలో వేసి కాలబెట్టడం మొదలైంది. అక్కడ చెత్త వేసి కాలబెట్టడం వల్ల పోలుకమ్మ చెరువులోకి చెత్తాచెదారం చేరడం తోపాటు పర్వతగిరి నుంచి నెక్కొండకు వచ్చే, వెళ్లే ప్రయాణికులకు చెత్తను కాల్చే సమయంలో దుర్వాసన, పొగ కమ్ముకుంటూ ఇబ్బంది తప్పడం లేదు. డంపింగ్ యార్డు లేని కారణంగా ఆరుబయట చెత్త వేయడంతో చెరువులో చేపలు చనిపోవడం, ప్రయాణికులు అస్వస్థతకు గురికావడం చోటు చేసుకుంటోంది. ఇకనైనా గ్రామపంచాయతీ అధికారులు నూతన డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి ఇబ్బందులను తొలగించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

తక్షణమే డంపింగ్ యార్డు ఏర్పాటు చేయాలి



పర్వతగిరిలో తక్షణమే డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి చెత్తను ఆరుబయట వేయకుండా చూడాలి. పోలుకమ్మ చెరువు పెద్ద చెరువు రిజర్వాయర్ ప్రాంతం కాకుండా మరో ప్రాంతాన్ని ఎంపిక చేసి డంపింగ్ యార్డు నిర్మించాలి. మండల కేంద్రంలో ప్రభుత్వ స్థలం ఉన్నా అధికారులు గుర్తించడంలో జాప్యం చేస్తున్నారు. తక్షణమే స్థలాన్ని ఎంపిక చేయాలి.

–పాలేపాక కల్యాణ్, పర్వతగిరి

దుర్వాసనతో ఇబ్బంది



మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి సమీపంలో పోలుకమ్మ చెరువు ఉండగా చెత్తను వేసి కాలబెట్టడంతో కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. రాత్రి 10 గంటల నుంచి తెల్లవారుజాము నాలుగు గంటల వరకు దుర్వాసన ఎక్కువగా వస్తుండడంతో కాలనీవాసులు అస్వస్థతకు గురవుతున్నారు. ఇకనైనా శాశ్వత ప్రాతిపదికన డంపింగ్ యార్డు ఏర్పాటు చేసి ప్రజలు దుర్వాసన నుంచి రక్షించాలి.

–బొట్ల ప్రభాకర్, పర్వతగిరి

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

కాజీపేట: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని జూబ్లీమార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలను ప్రధాన పూజారి జాగర్లపూడి శ్రీనివాస్‌శర్మ మంగళవారం ప్రారంభించారు. అభయాంజనేయుడికి అభిషేకం, సింధూర లేపనం, ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు పూజలు నిర్వహించి కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. గణపతి పూజ, నవగ్రహారాధన, కలశస్థాపన చేశారు. ఈనెల 17న ఆలయ ఆవరణలో సీతారాముల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని శ్రీనివాస్ శర్మ కోరారు. కార్యక్రమంలో పండితులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. ఎండుతున్న పంటలు

చెన్నారావుపేట : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోగా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో మండలంలోని ఎల్లాయగూడెం గ్రామానికి చెందిన రైతులు వేసిన వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోతున్నాయి. రైతులను, ప్రజలను వేదనకు గురి చేస్తున్న సమస్య వివరాలిలా.. ఎల్లాయిగూడెం శివారులోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వారం రోజుల క్రితం కాలిపోయింది. దీంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో రైతులు వేసిన వరి, మొక్కజొన్న పంటలకు సాగు నీరు అందక ఎండిపోతున్నాయి. అలాగే గ్రామంలోని 2, 3 వార్డులకు తాగునీరు సరఫరా కావడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని రైతులు విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకున్న దాఖలాల్లేవన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయించి కరెంట్ సరఫరా చేయాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తాం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిన విషయం వాస్తవమే. దాని స్థానంలో వేరే ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడానికి తీసుకొచ్చాం. ఉగాది పండుగ నేపథ్యంలో సిబ్బంది సెలవులో ఉన్నారు. నేడే (బుధవారం) ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి కరెంట్ సరఫరా కొనసాగిస్తాం. రైతులు సమాచారం ఇచ్చిన మేరకు ఏర్పాటు చేస్తున్నాం.

–జోగానంద్, ఏఈ, విద్యుత్ శాఖ



కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్